ప్రజాస్వామ్యంపై అవగాహన ఉండాలి



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: విద్యార్థులు చదువుతో పాటు ప్రజాస్వామిక విలువలపై అవగాహన కలిగి ఉండాలని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మండవ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం సుభాష్‌నగర్‌లోని పాఠశాల ఆవరణలో డెమోక్రసీ డేను నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు చేసి వివిధ తరగతులకు టీమ్ లీడర్లు, హెడ్ గర్ల్, హెడ్ బాయ్‌ల ఎంపికను ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాఠశాల అకాడమిక్ కరెస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత ఎన్నికలను పర్యవేక్షించారు.

అన్నదానానికి చేయూత



బియ్యం బస్తాలు అందజేస్తున్న సురేష్‌కుమార్

చింతల్: పేద ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలని లార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం గణేష్‌నగర్‌లోని లక్ష్మి ఫ్రీ టైలరింగ్ సెంటర్ చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమానికి తనవంతు సహాయంగా సురేష్‌కుమార్ 15 బ్యాగుల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణతో ఎంతో మంది మహిళలు ఆర్థికవృద్ధి సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శిక్షణ సెంటర్ నిర్వాహకురాలు సాయిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు



కుత్బుల్లాపూర్: ప్రపంచ స్పేస్ ప్రయోగ పోటీలో అమెరికా నాసా నిర్వహించిన (నేషనల్ స్పేస్ షటిల్మెంట్)స్పేస్ కాలనీ విభాగంలో శ్రీ చైతన్య దూలపల్లి విద్యార్థులు స్పేస్ కాలనీ, అంతరిక్షంలో భోజనశాల ప్రాజెక్ట్ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి పొందారు. ఈ ప్రాజెక్ట్ లో పాల్గొన్న కమ్మం ధాత్రి, దారావత్ మమత, నక్క ఆరాధ్యలను శనివారం పాఠశాల అసెంబ్లీలో ప్రిన్సిపాల్ హేమలత అభినందించారు. కార్యక్రమంలో కొంపల్లి జోన్ ఏజీఎం రమణరావు, అసోసియేట్ ఏజీఎం శ్రీనివాస్, కో ఆర్డినేటర్ రవి, హేమలత, ధనలక్ష్మి, డీన్ శ్రీకాంత్, నాసా ఇన్‌చార్జి రమణ తదితరులు పాల్గొన్నారు.

13న ధర్నాకు కదలాలి



సాయిబాబానగర్‌లో పింఛన్‌దారులతో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: పింఛన్ల పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సర్యం చేస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు రాసమల్ల యాదగిరిమాదిగ, సెల్వర్ శ్రీను మాదిగ అన్నారు. శనివారం సాయిబాబానగర్‌లో వృద్ధులు, దివ్యాంగులతు, వితంతువులు, ఇతర ఆసరా పింఛన్‌దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 13న పద్మశ్రీ మందకృష్ణమాదిగ పిలుపు మేరకు పింఛన్‌దారులతో చేపట్టనున్న మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న పింఛన్లను పెంచకుండా మోసం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో లక్ష్మి, బేగం, శేషమ్మ, సజత బేగం, సూర్యకల, రాజలింగ, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ బిక్స్ డైరెక్టర్‌పై ఫిర్యాదు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లోని బిక్స్ విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు అవినీతి, టెండర్లలో అక్రమాలపై జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి సంఘాల నాయకులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు శనివారం ఫిర్యాదు చేశారు. అవినీతికి అవకాశం లేకుండా నిబంధనలు అమలు చేయాలని కోరారు. విశ్వవిద్యాలయ భవనాలు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతుల పరిస్థితి బాగోలేదని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎస్.కరుణాకర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, తేజ, దిలీప్, జగన్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రణాళిక లేమితో

వాహనదారులకు ఇక్కట్లు!

- రాత్రి వేళల్లో చేపట్టాల్సిన పైపులైన్ పనులు పగటిపూట చేస్తున్న వైనం
- గణేష్ నగర్ బస్టాప్ నుంచి షా థియేటర్ వరకు ట్రాఫిక్ జామ్



చింతల్ గణేష్‌నగర్ బస్టాప్ నుండి షా థియేటర్ వరకు ట్రాఫిక్ జామ్

చింతల్: అధికారులు, కాంట్రాక్టర్ల అనాలోచిత నిర్ణయాలతో వాహనదారులు, ప్రయాణికులు అర్ధ రాత్రి వరకు నరకం చూస్తున్నారు. రాత్రి సమయాల్లో చేపట్టాల్సిన పనులు ఉదయం వేళల్లో చేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం నీరు నిలవకుండా ఉండేందుకు ఆయా బస్తీలు, కాలనీల నుంచి వచ్చే నాలాలకు అనుసంధానం నుంచి నూతన పైపు లైన్లు వేస్తున్న క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు సరైన ప్రణాళిక లేకపోవడంతో ట్రాఫిక్ రద్దీతో ప్రతిరోజు చుక్కలు చూపిస్తోంది. హెచ్‌ఎంటీ జంగల్ నుంచి భగత్ సింగ్‌నగర్ చింతల్ చంద్రనగర్ మీదుగా వచ్చే వర్షపు నీరు గతంలో చిన్న పైపులైన్ల ద్వారా గణేష్ నగర్‌లో కలుస్తాయి. అదేవిధంగా మరొక లైన్ చంద్రానగర్, రంగానగర్ మీదుగా గణేష్ నగర్‌లో కలుస్తుండేది. దీంతో హెచ్‌ఎంటీ జంగల్ నుంచి వచ్చే వర్షపు నీటి వరద బాలానగర్ నుంచి వెళ్లే నర్సాపూర్ రాష్ట్ర రహదారి వరద నీటితో నిండి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్ని సమయాల్లో అనేక వాహనాలు వరద నీటిలో చిక్కుకొని మొరాయించడంతో గంటలు తరబడి ట్రాఫిక్ ఏర్పడుతుంది. దీనికి పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఇటీవల 800 ఆర్‌సీసీ పైప్ లైన్లను వేస్తున్నారు.

రాత్రివేళ చేసే పనులకు ఉదయం వేళల్లో...

సాధారణంగా ప్రధాన రోడ్లపై పైపులైన్ల విస్తరణ రాత్రి వేళల్లో మాత్రమే చేస్తుంటారు. ఓవైపు ఇది రాష్ట్ర రహదారి అయినప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కేవలం ఉదయం నుంచి సాయంత్రం వరకే తవ్వకాలు చేపట్టి పైపులైన్ విస్తరణ చేపడుతున్నారు. వారం రోజుల క్రితం మూడు రోజుల పాటు పనులు చేపట్టి మరో రెండు రోజులపాటు విరామం ఇచ్చి మరల గురువారం పనులు మొదలు పెట్టారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైతే అర్ధ రాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్‌జామై వాహనాలు కదలలేని పరిస్థితి నెలకొంటుంది. రాష్ట్ర రహదారి కావడం ఒకపక్క, మరోవైపు జీడిమెట్ల పారిశ్రామిక వాడకు నిత్యం మండలాల బస్సులు అదే విధంగా బహదూర్‌పలి, దుండిగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే వివిధ కళాశాలలకు చెందిన బస్సులు వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధానం. దీంతో వాహనాల రద్దీ ఎప్పుడూ అధికంగానే ఉంటుంది. రాత్రి వేళల్లో చేపట్టే పనులను పగలు పూట చేయడంతో వాహనాలు కదలలేని దుస్థితి తలెత్తుతుంది.

రోడ్డు క్రాసింగ్‌ను మూసివేసిన ట్రాఫిక్ పోలీసులు

గణేష్‌నగర్ బస్టాప్ పక్కన షా థియేటర్ సమీపంలో రోడ్డు క్రాస్ వద్ద గతంలో అధికారులు ఓ సిగ్నల్ ఏర్పాటు చేశారు. బస్సు ప్రయాణికులు, రోడ్డు దాటేవారి కోసం సిగ్నల్ పడినప్పుడల్లా అటు ఇటు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు బాలానగర్ సమీపంలోని ఉషా, ఆక్సోనోబల్ పెయింట్ కంపెనీ నుంచి చింతల్ బస్టాప్ వరకు ట్రాఫిక్ కదల లేకుండా ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు ఈ గణేష్ నగర్ నాలా వద్ద ఉన్న రోడ్డు క్రాసింగ్‌ను మూసివేశారు. దీంతో రోడ్డు క్రాసింగ్ చేసేవారు ఎలాగైనా రోడ్డు క్రాస్ చేయాలని అక్కడే నిలబడుతుండటంతో ట్రాఫిక్ రదీద్ మరింత తీవ్రతరమవుతుంది.



చింతల్ ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న ఆర్‌సీసీ పైపులైన్ పనులు

ఎమ్మెల్యేను కలిసిన వుడ్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న విషయంపై ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌ను జీడిమెట్ల డివిజన్ వుడ్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షపతి ఆధ్వర్యంలో శనివారం కలిసి వివరించారు. ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి సమస్యపై ఆరా తీశారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు కోసం ఇబ్బంది పడుతున్న క్రమంలో ఇటీవల హెచ్‌ఎండీఏ ప్రతినిధులు సదరు రోడ్డు వెంట ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వివిధ కాలనీల సభ్యులు ఎమ్మెల్యేకు తమగోడు వివరించారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం పనులు జరుగుతుండగా పూర్తిగా రోడ్డు మూసివేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గతంలో ఈ కాలనీలకు రోడ్డు సౌకర్యంగా ఉన్న ప్రాంతాన్ని సైతం చదును చేస్తుండడం.. మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు లేదని కాలయాపన చేస్తూ వస్తూ తాజాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు రోడ్డు విషయమై ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

యాంటీ లార్వా కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్



విద్యార్థినితో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

కుత్బుల్లాపూర్: నగర వాసులు అనారోగ్య పాలు కాకుండా యాంటీ లార్వా కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కూకట్‌పల్లి జోన్ పరిధి కుత్బుల్లాపూర్ సర్కిల్ కాకతీయ నగర్, అల్వాల్ సర్కిల్‌లోని భూ లక్ష్మీనగర్, మచ్చబొల్లారం, భూదేవి నగర్ ప్రాంతాలలో మాన్సూన్ శానిటేషన్, యాంటీ లార్వా (ఏఎల్‌ఓల) కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. కాకతీయ నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ఉన్న విద్యార్థిని నీరు నిల్వ ఉంటే వచ్చే వ్యాధుల గురించి చెప్పమని కోరగా.. దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ ఇతర వ్యాధులు వస్తాయి అని చెప్పడంతో ఆ విద్యార్థిని అభినందించారు. నివాసితులతో మాట్లాడి చెత్త సేకరణ, యాంటీ లార్వా చర్యలు, కాలనీలో ఎదురవుతున్న ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కారం జరగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా చర్యా నివేదిక (ఏఎల్‌ఓలు) సమర్పించాలన్నారు. పేరుకుపోయిన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటే, వాటిని వెంటనే వాట్సాప్ నంబర్ 81259 66586 కు ఫొటో పంపితే తక్షణమే పరిష్కారం చేస్తామని తెలిపారు. దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, డిప్యూటీ కమిషనర్, నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు విన్నవించిన సమస్యలపై ఆయా విభాగాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్సీ ఆదేశించారు. అదే విధంగా శుభకార్యాలకు రావాల్సిందిగా పలువురు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికలను అందజేశారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలు వివరిస్తున్న కాలనీల ప్రతినిధులు



కుంగిన మ్యాన్‌హోల్.. పట్టించుకోని సిబ్బంది

నిజాంపేట్: విజయపురి కాలనీ, ఎన్టీఆర్ నగర్ మీదుగా ప్రగతినగర్ వెళ్లే రోడ్డు శ్రీరాగా అపార్ట్‌మెంట్ కూడలిలో మ్యాన్‌హోల్ కుంగిపోయింది. రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తూనే ఉంది. దీంతో వాహనదారులు, అలుగా వెళ్లేవాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుంగిన మ్యాన్‌హోల్‌ను సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టి ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్‌ఫండ్ పథకంతో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ ఉజైర్‌కు రూ.2 లక్షలు, సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన మహేష్‌కుమార్ పట్నాయక్‌కు రూ.1 లక్ష సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు కాగా శనివారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, సిద్ధికి, ప్రభుదాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

షాపూర్‌నగర్ పీహెచ్‌సీలో వసతులను మెరుగుపర్చాలని ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ నవనీత ఆధ్వర్యంలో వైద్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫర్నీచర్, మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం అవి పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు.

తరలిన బీజేపీ నేతలు



ధర్నాలో పాల్గొన్న కొంపల్లి మున్సిపల్ నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బీసీ మహాధర్నాకు కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మేడ్చల్ అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాస్, రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి సరితరావు, సీనియర్ నాయకులు చక్రధర్, నర్సింగ్‌రావు, మధు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాత



సుభాష్‌నగర్: మేత కోసం వెళ్లిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన గాజులరామారంలో జరిగింది. గాజులరామారానికి చెందిన పాడి రైతు పప్పిరెడ్డి రోజు మాదిరిగానే తన గేదెలను మేత కోసం శనివారం ఉదయం చింతల్ చెరువు సమీపంలోకి వదిలాడు. లాల్ సాహెబ్ గూడకు వెళ్లే దారిలో విద్యుత్ వైర్లు భూమికి దగ్గరగా ఉండటంతో రెండు గేదెలు మేస్తూ విద్యుత్ తీగలకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న రైతు పప్పిరెడ్డి అక్కడికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యాడు. గేదెల విలువ రూ.2 లక్షల పైన ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధిలోని ఆర్‌ఎస్‌జీ సుప్ర అవెన్యూ వాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. హన్మంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



ధర్నాలో మున్సిపల్ నాయకులు

దుండిగల్: బీసీ రిజ్వరేషన్లలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నిందని, బీసీలు గుణపాఠం చెప్పాలని బీజేపీ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఇందిర పార్కులోని ధర్నాచౌక్‌లో బీజేపీ బీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి దుండిగల్ మున్సిపల్ నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 8 శాతం లేని ముస్లింలకు పది శాతం రిజర్వేషన్ ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్ చారి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి తురాయి భానుగౌడ్, సీనియర్ నాయకులు దమ్మగారి ప్రభాకర్‌రెడ్డి, యువమోర్చా నాయకులు అల్లూరి విష్ణు, గణేష్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

రంగారెడ్డినగర్: పుట్టిన గంట లోపే బిడ్డకు తల్లి పాలు పట్టించాలని రంగారెడ్డినగర్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిరాజ్ అన్నారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లి పాల ప్రాధాన్యతను వివరించారు. ఓ తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొదటి కానుక తల్లిపాలని, బిడ్డకు పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లి పాలు ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు తల్లి పాలలో సంవృద్ధిగా లభిస్తాయని తెలిపారు. ఏఎస్‌ఎం కమలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, లలిత, రాధ, నర్సమ్మ, నాగలక్ష్మి, జ్ఞానేశ్వరి, ఆశావర్కర్లు, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిరాజ్

ఘనంగా సెయింట్ ఆంథోనీస్ ఫ్రెషర్స్ డే



బహుమతులు అందజేస్తున్న సీఐ విజయవర్ధన్, కరస్పాండెంట్ సుందరరాజు

కుత్బుల్లాపూర్: కొంపల్లి సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే శనివారం ఘనంగా జరిగింది. కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమానికి పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అకాడమిక్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు, వివిధ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చదువుపై దృష్టి సారించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సుందరరాజు మాట్లాడుతూ.. ఇంటర్‌లో రెండు సంవత్సరాలు కష్టపడితే పై చదువుల్లో రాణించి ఉన్నత స్థానంలో స్థిరపడతారన్నారు. అనంతరం కళాశాల స్టూడెంట్ కౌన్సిల్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలిగా అర్చన వర్కింగ్ ప్రెసిడెంట్ చరణ్, సెక్రటరీ కన్నన్ నియమితులయ్యారు.

చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్: ఉస్మాన్ చెరువు దత్తత పేరుతో కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆకుల సతీష్, ఆంజనేయులు కోరారు. శనివారం గాగిల్లాపూర్‌లోని ఉస్మాన్‌కుంట చెరువును బఫర్ జోన్‌లో అక్రమణలతో పాటు 214 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి కబ్జాపై దుండిగల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 201, 202, 203, 204, 205, 206, 207, 208, 212పీలలో హెచ్‌ఎండీఏ అనుమతులతో 70 ఎకరాల్లో 800 విల్లాస్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టు మధ్యలో 6.816 ఎకరాల్లో ఉస్మాన్ కుంట ఉందని, ఇరిగేషన్ శాఖ అధికారులు ఏ విధంగా ఎన్‌ఓసీ ఇచ్చారని ప్రశ్నించారు. చెరువు దత్తత పేరుతో కబ్జాకు పాల్పడుతున్నారని, ఇప్పటికే ఏడున్నర మీటర్ల బఫర్ జోన్‌ను పూడ్చి నిర్మాణాలు చేపట్టారన్నారు. చెరువులో నిర్మించిన 8 విల్లాలు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఉస్మాన్ కుంట, ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, అరుణ్ రావు, చందు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డే



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లతో విద్యార్థులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని సీఎంఆర్ స్కూల్‌లో శనివారం ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాధానోపాధ్యాయురాలు జ్యోత్స్న విద్యార్థులకు స్నేహం గొప్పతనం, పరస్పం ఏ విధఃగా మెలగాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఏవో సత్తిబాబు, వైస్ ప్రిన్సిపాల్ మోహక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణను అలవర్చుకోవాలి

జీడిమెట్ల: విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని హెచ్‌ఏఎల్ కాలనీ రవీంద్ర స్కూల్ ప్రిన్సిపాల్ శశిరేఖ అన్నారు. శనివారం పాఠశాలలో క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేసి హెడ్‌బాయ్, హెడ్‌గర్‌లను ఎన్నుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ గృహలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అన్ని విభాగాల్లో నిష్ణాతులై ఉండాలి

జీడిమెట్ల: పోలీసు వృత్తిలో కొనసాగుతున్న హోంగార్డు నుంచి పైస్థాయి అధికారి వరకు అన్ని విభాగాల్లో నిష్ణాతులై ఉండాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. శనివారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో జీడిమెట్ల పీఎస్ సిబ్బందికి చేతిరాత, డ్రాఫ్టింగ్, వ్యక్తిగత వికాసంపై క్లాసులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ చేతిరాత నిపుణలు డాక్టర్ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ ఇచ్చారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ నరేష్‌రెడ్డి సహకారంతో క్లాసులను నిర్వహించినట్లు తెలిపారు.



పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న మల్లికార్జునరావు